హైస్కూలు చదువు పూర్తయ్యాక కాలేజీలో చేరే ప్రయత్నాలు మొదలుపెట్టాను. మంచి మార్కులు వచ్చాయి. అమ్మా నాన్న చాలా సంతోషించారు. నా మార్కుల్ని చూసి మా నాన్న 'నా మాట నిలబడతావనే నమ్మకం కుదిరిందిరా!' అన్నాడు సంబరంగా.

అయతే విధి నిర్ణయం మరోలా ఉందని తొందరలోనే తెలిసింది!

నాన్న ఒకరోజు విరుచుకు పడిపోయాడు. హాస్పటల్‌కి తీసుకెళ్తే పక్షవాతం అన్నారు. ఒక కాలు, చెయ్యి పనిచేయటం లేదు. మాట మాత్రం కొంచెంగా వస్తోంది! ఏం చేయాలో మాకు తోచలేదు. ఇంట్లో... మంచం మీదే ఉంటున్నాడు. ఏదో వైద్యం జరుగుతోంది.

ఆ పరిస్థితుల్లో... నేను కాలేజీకని వెళ్ళి బయటుండటం నాకు ఇష్టం లేకపోయింది. నాన్నమ్మ, అమ్మ నా అభిప్రాయానికి అంగీకరించలేదు.

'మేమిద్దరం మీ నాన్ననీ, ఇంటినీ.. అన్నీ బాగానే చూసుకోగలం... నువ్వుండి చేసేదేం లేదుగానీ చదువాపకు' అని గట్టిగా చెప్పేసారు.

నాన్న ముందు కోపంగా చూశాడు...తర్వాత కన్నీళ్ళు కార్చాడు.తర్వాత బతిమాలు తున్నట్లు సైగ చేశాడు. 'నాకు మాట ఇచ్చావు కదరా బాగా చదువుకుంటానని' అంటూ ముద్ద మాటలతో గుర్తు చేశాడు.

'నాన్నా... నీకిచ్చిన మాటను నేను తప్పలేదు. అమ్మ కంటే కొన్ని తరగతులు ఎక్కువే చదివానుగా...' అంటూ చిన్నగా నవ్వాను.

భారమంతా అమ్మా నాన్నమ్మల మీద వదిలేసి చదువుకని పొరుగూరు వెళ్ళి ప్రశాంతంగా ఉండలేననిపించింది. అందుకే, ఎవరెన్ని విధాలుగా చెప్పినా నేను నా అభిప్రాయాన్ని మార్చుకోలేదు.

చివరకు నరసింహమూర్తిగారు కూడా మా ఇంటికి వచ్చి నాకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. 'పాలేర్లు ఉన్నారు... అన్ని పనులూ చక్కబెట్టగలరు... ఇంట్లో నాన్నని చూసుకుంటూ అమ్మా, నాన్నమ్మ ఇంటిపనులూ చేసుకుపోతారు... మరింకేవిటీ నీ అభ్యంతరం...?' అంటూ నన్ను నిలదీశారు.

'నేను లేకపోయనా పనులన్నీ బాగానే జరిగిపోతాయన్నది నాకూ తెలుసు. అయితే... అది నాకు సంతృప్తి నివ్వదు. పాలేర్లు అంతా ఇళ్ళకి వెళ్లిపోయాక ఏం అవసరం వస్తుందో, అమ్మా వాళ్ళు ఏం అవస్థలు పడతారో అని నాకు నిద్రపట్టనివ్వదు. దగ్గిరుంటే నాకు నిశ్చింతగా ఉంటుంది!' ఈ మాటల్నే మూర్తిగారికీ చెప్పాను.

ఆయనకూ నా అభిప్రాయం నచ్చిందనుకుంటా, అందుకే నాకు నచ్చచెప్పే ప్రయత్నం

మాని నాన్నకు చెప్పారు.

'రాఘవా... చదువంటే... కాలేజీకి వెళ్లి చదవటమే కాదు. ఆసక్తి ఉంటే ఎలాగైనా చదువుకోగలడు. ఉద్యోగం చేయాలనే ఉద్దేశ్యం లేకపోతే... చదువు పేరుతో ఉన్న ఒక్కడూ పొరుగూర్లో ఉండటమెందుకూ...? వీడి గురించి నువ్వేం బెంగపడకు. అసలు నేనిక్కడకు వచ్చింది... మిమ్మల్నీ, మీ ఇంటినీ నేను కనిపెట్టి చూసే బాధ్యత తీసుకుంటాననీ, నీ కొడుకుని నిశ్చింతగా చదువుకోమని నచ్చచెప్పాలనే! కానీ ఇక్కడకు వచ్చాక నా అభిప్రాయం మారింది. వీడి మాటలే నిజమనిపించాయి. ఇక్కడి పనులన్నీ అయ్యాక రోజూ వీడిని మా ఇంటికి పంపిస్తే... బాగా చదువుకుంటాడు. నాకు తోడుగా ఉండి... ఉద్యోగమే కాకపోయినా డబ్బు, పేరు ప్రతిష్టలు... అన్నీ సంపాదించగలిగే తెలివితేటలూ పొందగలడు...! అది చాలదా...?' ఆ మాటలతో నాన్న కొంచెం సేదతీరాడనిపించింది!

'మీ ఇష్టం' అనటం వినిపించింది.

నాన్న ఇష్టంగా అంగీకరించట్లనిపించటంతో నాకూ నిశ్చింత కలిగింది!

అలా నా కాలేజీ చదువుకు గండిపడి..ఇంకోరకం చదువు మొదలైంది! అంటే..పరీక్షలకి ప్రైవేటుగా చదువుకోవటం కాదు...! నరసింహమూర్తి గారింట్లో ఓ లైబ్రేరీలో ఉండేన్ని పుస్తకాలు ఉంటాయి. ఒకటని కాకుండా అన్ని రకాలూ ఉంటాయి. అప్పుడు నా ప్రధాన వ్యాపకం ప్రతీ రోజూ ఏదో ఒక పుస్తకం చదవటమే. మునుపు స్కూలుకి వెళ్ళినట్లుగా ఇంట్లో పనులన్నీ ముగించుకుని నరసింహమూర్తిగారింటికి వెళ్ళి... పొలంలోవి గానీ, ఇంట్లోవి గానీ ఆయన చెప్పిన పనులు చక్కబెట్టటమూ జరుగుతోంది.

ఊరి పనులుకోసమో, స్వంత పనులకోసమో చాలామంది నరసింహమూర్తిగారింటికి రావటం జరుగుతుంది... మూర్తిగారి తండ్రికి ఉన్న పరపతిని బట్టి రాజకీయ నాయకులతోనూ, ప్రభుత్వాధికారులతోనూ పరిచయాలున్నాయి. అందుకే మూర్తిగారినీ ఊరిపెద్దగా భావించి చాలామంది కలవటానికి వస్తూంటారు. అలా వచ్చే వాళ్ళని పలుకరించటంతో నాకూ చాలామందితో పరిచయాలు ఏర్పడ్డాయి.

రెండు భిన్నరకాలైన ప్రపంచాలలో జీవిస్తున్నట్లుగా నాకనిపించేది! ఎందుకంటే మా ఇంట్లో వాతావరణం, మూర్తిగారింటికి చాలా భిన్నంగా ఉండేది!

మా నాన్నది పూర్తిగా పశు సంరక్షణ. మూర్తిగారిదేమో ఊరి ప్రజల బాగోగులు చూడటం...! నరసింహమూర్తిగారి భార్యా ప్లిలలు పట్నంలో ఉంటారు. అక్కడున్న మేడ... ఆమెకు వారి తండ్రిగారిచ్చినది... దానిలో ఉంటూ పిల్లల్ని చదివిస్తున్నారు. ఇదే మా అందరి అభిప్రాయం. కానీ ఒకసారి నరసింహమూర్తిగారు మా నాన్నతో అనటం విన్నాను. 'రాఘవా... భార్యా భర్తలిద్దరిదీ ఒకటే దారి అయితే, చేయీ చేయీ కలిపి ఒకే దారిలో నడుస్తారు! ఎన్ని ఎత్తుపల్లాలు ఎదురైనా ఒకరికొకరు ఆసరాగా ఉన్నామనే భరోసాతో ఉల్లాసంగా ప్రయాణిస్తారు..!

లేకపోతే ఏముందీ... ఇద్దరివీ వేరు వేరు దారులూ... మనసు చంపుకుని ఒకరి దారిలోకి మరొకరు వెళ్ళలేక సతమతమవుతూ భారంగా బ్రతుకీడ్చాల్సివస్తుంది! నువ్వు అదృష్టవంతుడివి సుమా...!'

అప్పుడు నాకు సరిగా అర్థం కాలేదుగానీ, ఆ తర్వాత అర్థం అయింది...! అవును మరి... మూర్తిగారు ఇక్కడ ఉంటే... కుటుంబం వేరే చోట ఉంటోంది... ఇద్దరివీ వేరు వేరు దారులే కదా! అప్పుడప్పుడూ చుట్టం చూపుగా వచ్చి వెళ్తూంటారంతే...!

ఆ విషయం నాకు ఇంకోసారి రూఢీగా రుజువైంది కూడా!

ఒకసారి నేను మూర్తిగారింట్లోనే ఉన్నపుడు... వారిద్దరి మధ్యా జరిగిన వాగ్యుద్ధానికి ప్రత్యక్ష సాక్షిని మరి!

స్కూలు రోజుల్లోని సంగతి... చదువుకోవటానికి వెళ్ళేవాడినిగా, ఒక రోజు వారింట్లో చేసిన టిఫిన్ వంటమనిషి మునిరాజు నాకు తెచ్చిచ్చాడు. నేను ఉదయమే ఇంట్లో అన్నం తిని వచ్చే అలవాటుండటంతో వద్దన్నాను. అప్పటికి మూర్తిగారి అమ్మ ఉన్నారు.

'చిన్న పిల్లాడివి... ఎన్నిసార్లు ఎంత తిన్నా అరిగిపోతుంది. ఎదిగే వయసు... తిను...' అంటూ ఆవిడ కోప్పడితే, మోహమాటంగా కొంచెం తినక తప్పలేదు.

ఆ మరునాడు మూర్తిగారు నాన్న వచ్చినప్పుడు 'రాఘవా... నువ్వు స్నేహధర్మంగానే అనుకో... రోజూ ఇస్తున్నా కాదనకుండా పాలు తీసుకుంటున్నామా... కానీ నీ కొడుకు చూడు... నీలాగే మమ్మల్ని దూరం పెడుతున్నాడు! మా ఇంట్లో ఏదీ తినకూడదని వాడికి చెప్పావా...?' అనగానే ముందు పూర్తిగా విషయం తెలియక నాన్న బిత్తరపోయాడు... తర్వాత తెలుసుకుని చిరునవ్వుతో అలాంటిదేం లేదని, ఆకలి లేక తినలేకపోవటమే అయ్యుంటుందని అన్నాడు.

ఆ తర్వాత నుండి ఇంటి దగ్గర ఏదో తిన్నాననిపించుకుని, అక్కడికి వెళ్ళాక టిఫిన్లు ఇష్టంగా తినటానికి అలవాటు పడ్డాను.

నరసింహమూర్తిగారి అమ్మగారు కూడా పోయాక, ఇక ఆ అలవాటుకు స్వస్తి చెప్పాను. ఎపుడైనా కాదనకుండా తినటం జరుగుతూంటుంది.

ఆ రోజూ అలా తింటోంటే... ఊరునుండి వచ్చారు కాబోలు... అమ్మగారు వచ్చి నావంక, టిఫినువైపు ఒక క్షణం ఆరాగా చూశారు. నాకొంచెం ఇబ్బందిగా అనిపించింది. వెంటనే లేచి నిలబడి నమస్కరించాను ప్లేటు పక్కన పెట్టి.

'ఓ... నువ్వేనా... ఆవుల రాఘవ కొడుకువి కదూ... నేనింకెవరో అనుకున్నా. చాలా మారిపోయావు... బాగా పొడుగయ్యావు...!' అనేసరికి అక్కడే ఉన్న నరసింహంగారు ఆమెతో 'నువ్వీమధ్య వచ్చి చాలానాళ్ళయిందిగా సుబ్బా... అందుకే గుర్తుపట్టలేకపోయావు...' అన్నారు.

అంతే... ఆమెకు కోపం తారాస్థాయిలో వచ్చేసింది.

అసలు పేరు సుబ్బలక్ష్మి అయితే, ఆమెకు ఇష్టంలేక 'శుభ'గా చిన్నపుడే మార్చుకున్నారట. ఆవిడ అమ్మమ్మగారో లేక నాన్నమ్మగారిదో పేరు సుబ్బమ్మ అయితే, సుబ్బలక్ష్మిగా నామకరణం జరిగింది. అది నచ్చక కొంచెం వయసు వచ్చాక ఆవిడే 'శుభ'గా మార్చుకున్నారట. నరసింహంగారికి దగ్గిర బంధువుల అమ్మాయే కాబట్టి ఆ విషయం తెలిసి, వాళ్ళిద్దరికీ పెళ్లయ్యాక తనకాపేరే ఇష్టమంటూ 'సుబ్బూ' అని పిలుస్తూంటారట!

'మీకెన్ని సార్లు చెప్పాను...నన్నలా పిలవొద్దని! నాకిష్టం లేదని తెలిసీ అలాగే పిలవటం అంటే, ఏమిటర్థం... ఈ ఊరి పట్ల, ఈ పల్లెటూరి జనం పట్ల ఉన్న ప్రేమలో ఆవగింజంతయినా కట్టుకున్నదాని పట్ల లేదనేగా... అవునా?'

'ఈ వూరంటే నాకిష్టం అన్నది నిజమే... కాదనటం లేదు! అయితే... ఆ ఇంకో మాట మాత్రం నిజం కాదని నీకూ తెలుసు... అభిమానం ఉంది కాబట్టే... ఈ ఊరుని ఏవగించుకుని దూరంగా వెళ్ళినా నిన్ను కాదనలేదు. అప్పుడప్పుడూ చుట్టం చూపుగా మాత్రమే వస్తున్నా వద్దనలేదు...!' చాలా సౌమ్యంగా చెప్పారు.

అలా మామూలుగా, మెల్లగా చెప్పటమే ఆవిడను మరింతగా మండించిందేమో తెలియదుగానీ పెద్దగొంతుతో విరుచుకు పడ్డారు.

'అంటే... ఇంట్లోకి రావద్దని కూడా అనగలరా.... ఈ ఇంటికి వూరివాళ్ళంతా స్వతంత్రంగా వచ్చిపోతుంటారు, నాకు ఆ మాత్రం హక్కు కూడా లేదా...?'

'ఈ ఇంటిమీద సర్వహక్కులూ ఉన్నది మొదట నీకే... అయితే... నా వెంటే ఉంటూ నన్ను కనిపెట్టుకుని చూస్తున్న ఈ ఊరి ప్రజల అభిమానం నన్ను నీ వెంట రాకుండా నన్నీ ఊళ్ళోనే కట్టిపడేసిందనిపిస్తుంది...!' అంటూ నిట్టూర్చారు.

'అదీ చూస్తాను... ఆ కట్లు విప్పి... మిమ్మల్ని తీసుకెళ్లేరోజు ఎందుకు రాదో...!' ఆమె గొంతు గద్గదమైపోయింది...!

'అలాంటి ప్రేమాభిమానాలకోసమే... నేనూ ఎదురుచూస్తున్నాను...!' తనలోనే అనుకుంటున్నట్లు నెమ్మదిగా గొణిగి... మళ్ళీ నిట్టూర్చారు.

అలాంటి సమయంలో... నేనక్కడ ఉండటం ఇబ్బందిగా అనిపించి... బయటకు రాబోతోంటే... ఆమె 'నువ్వెందుకూ బయటకు వెళ్ళటం... ఇందాకనే ఎవరో అబ్బాయిని గుమాస్తాగా పెట్టుకున్నారటగా అని నేనంటే, ఈయనగారు ఏమన్నారో తెలుసా... వాడు నా శిష్యుడు, అనుచరుడు మాత్రమే కాదూ, వారసుడైన మనబ్బాయికున్న సర్వహక్కులూ వీడికీ, ఈ ఇంట్లో ఉన్నాయని ఖచ్చితంగా చెప్పేశారు! రేపో మాపో నేనే వెళ్తున్నా. నువ్వే ముఖ్యుడివి. ఈ ఇంటి గొడవలన్నీ నీకూ తెలియాలిగా...!' అంటూ కళ్ళు తుడుచుకుని అక్కడ నుండి విసవిసా వెళ్ళిపోయారు.

నేను నిర్ఘాంతపోతూ స్థాణువులా నిలబడిపోయాను!

మరుక్షణమే తేరుకోగానే... నిలువునా పులకించిపోయాను! అవును మరి... నరసింహంగారే తన కొడుకులా నన్ను భావిస్తున్నారంటే... నాదెంతటి అదృష్టం...!

ఏం మాట్లాడాలో... అక్కడ ఉండాలో, ఉండకూడదో... ఏం తోచనట్లుగా ఒక క్షణం అలా నిలబడిపోయిన నావైపు నరసింహంగారు ముభావంగా చూసి 'మాకిదంతా మామూలే లేవయ్యా... ఆలోచిస్తే... నాదే తప్పనిపిస్తోంది... రెండు మూడు రోజులు ఉండి పోవటానికి వచ్చినావిడతో అవసరంగా ఆవేశంగా మాట్లాడి కోపం తెప్పించాను...! ఇక ఈ రోజుకి ఇంటికి బయలుదేరు...' అన్నారు.

నేను వెంటనే ఇంటికి బయలుదేరి వచ్చేశాను.

ఆ తర్వాత అమ్మగారు వెళ్ళేంతవరకూ అక్కడకు వెళ్ళటం అనవసరమనిపించి వెళ్ళలేదు.

ఆ మరునాడే రమ్మని మూర్తిగారు కబురంపించినా, వూరికెళ్ళాల్సిన పని చూసుకుని రెండు రోజుల్లో వస్తానని చెప్పి పంపేశాను.

ఆ రెండు రోజులూ నాన్న దగ్గరే ఎక్కువ కాలక్షేపం చేశాను. మూర్తిగారింటికి వెళ్ళటం లేదేం అన్న నాన్న సైగల భాషకు 'మేడమ్...అక్కడున్న రోజులు నాకు కొంచెం అసౌకర్యంగా అనిపిస్తుంది నాన్నా.... అందుకే...' అంటూ క్లుప్తంగా చెప్పాల్సివచ్చింది.

నాన్న ఇంకేం మాట్లాడలేదు.

స్థాయిని బట్టీ, వ్యక్తుల మనస్తత్వాన్ని బట్టీ... దూరం పాటించటమే మంచిదని నాకూ అర్థమైంది. అయితే ఈ సూత్రానికి కొందరు మినహాయింపుగా ఉంటారనేదీ నిజమే!

***

నాలుగురోజుల తర్వాత...

నరసింహమూర్తిగారు నేను వెళ్ళిన కాసేపటి తర్వాత 'మీ ఇంటికి వెళ్లొద్దాం... ఒకసారి పదరా...' అన్నారు. నాకేం అర్థంకాలేదు! 'నాన్న బాగానే ఉన్నాడండీ...' అన్నా కొంచెం అయోమయంగా చూస్తూ...

'అయితే చూడకూడదంటావా...?' చిరునవ్వుతో అని 'చాలా రోజులైందిగా, ఒకసారి చూసి రావాలనిపిస్తోంది...' అంటూ బయలుదేరారు.

మామూలుగా ప్రతీరోజూ చావిడిలోని పనులన్నీ పర్యవేక్షించి, నాన్నలాగే మూర్తిగారింటికి పాలు పంపించాక... నాన్న దగ్గర కూర్చుని పనులన్నీ ముగించానని ఏకరవు పెడితే, కాలూ, చెయ్యి నొక్కుతూ ఈ కబుర్లన్నీ చెబుతున్నప్పుడు నాన్నెంత ప్రేమగా నావైపు చూసేవాడో! దగ్గరుండి ఈ పనులన్నీ చక్కబెట్టగలుగుతున్నందుకు, నాకూ చాలా సంతృప్తిగా, సంతోషంగా అనిపించేది!

మూర్తిగారిని వెంటబెట్టుకుని వచ్చిన నన్ను చూడగానే అమ్మ హడావుడిగా నాన్న మంచం దగ్గిర కుర్చీలు జరిపి... మర్యాదలు చేసింది.

మా ఇంట్లో... మర్యాదలంటే... ప్రత్యేకంగా ఏమీ ఉండవు. ఆదరంగా పలుకరించటం, చల్లటి మజ్జిగ ఇవ్వటం... అంతే!

నరసింహంగారిని చూడగానే నాన్న మొహంలోకి వింత వెలుగు వచ్చింది! మీ కోసమే ఎదురు చూస్తున్నానన్నట్లు చాలా మెల్లగా, ముద్దముద్దగా పలికాడు.

ఆయన కుర్చీలో కూర్చుని కుశల ప్రశ్నలు వేసారు. నాన్న నా వైపు కొంచెం దిగులుగా చూడగానే... నాన్న మనసు అర్థం చేసుకున్నట్లుగా మూర్తిగారు ఆప్యాయంగా నాన్న చేయి పట్టుకుని అన్నారు.

“రాఘవా... మీవాడి గురించి నీకు దిగులేం అక్కర్లేదు. నీ వల్ల వీడి చదువు ఆగిపోయిందని అనుకుంటున్నావని నేను గ్రహించానుగానీ, అది నిజం కాదు. వాడు చక్కగా మీ వ్యాపారాన్ని చక్కబెట్టుకోగలుగుతున్నాడు డిగ్రీలతో పనే ముందీ...? నీలాగే నిజాయితీ పరుడనే పేరునూ సంపాదించుకున్నాడు. అంటే... నీ పేరును నిలబెట్టాడు!

మీవాడు నీకు చెప్పాడో లేదోగానీ... మొన్నీమధ్య మనవూళ్ళో పెద్దసభ జరిగింది. ఆ విశేషాలు క్లుప్తంగా చెప్పి వూరుకుని ఉంటాడు. నేను వివరంగా చెబుతా.

మన నియోజకవర్గంలో ఏర్పడిన ఖాళీని బట్టి త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయిగా, అందుకని... పార్టీ పెద్దలు మన ఊళ్ళో సభ నిర్వహించారు. మా తాతగారికున్న పేరు ప్రతిష్ఠలు చిన్న వయసులోనే మరణించిన నాన్నగారి పట్ల సానుభూతినీ దృష్టిలో ఉంచుకుని నన్ను అధికారపార్టీ అభ్యర్థిగా నిర్ణయించాలని అనుకున్నారట! కానీ తర్వాత ఏం జరిగిందో తెలుసా?

సభ జరిగిందని చెప్పా కదా, ఎందరో పెద్దపెద్ద నాయకుల సమక్షంలో నిలబడి మనవాడు ఎంత బాగా ఉపన్యసించాడనుకున్నావ్! మధ్య మధ్యలో మహామహుల మాటల్ని కొటేషన్లుగా చెబుతూ అనర్గళంగా సాగిన వీడి ఉపన్యాసం వింటూ నేనెంత ఆశ్చర్యపోయానో! ఇప్పటివరకూ ఏదో పుస్తకాలు చదువుతున్నాడని అనుకున్నానేగానీ ఇంత బాగా వంట బట్టించుకున్నాడనే సంగతిని గ్రహించలేకపోయా.

సభ పూర్తయ్యాక నాతో సహా పెద్దపెద్ద నాయకులనబడే వాళ్ళు అందరూ వీడిని ప్రశంసలతో ముంచెత్తేశారు!

ఇలాంటి నాయకత్వ లక్షణాలున్న యువకులకు అవకాశం ఇచ్చి ప్రోత్సహించాలనే పార్టీ అధినాయకత్వమూ కోరుకుంటోంది! కాబట్టి వీడయితేనే ఉత్సాహంగా పనిచేయగలడనే అభిప్రాయంతో నా బదులు వీడినే మన నియోజకవర్గ అభ్యర్థిగా నిలబెట్టటం బావుంటుందని నేనే వాళ్ళకి సూచించాను. దానికి అందరూ ఆనందంగా అంగీకరించారు కూడా!

ఈ మాట నీకు చెప్పాలనే ఈ రోజు నీ దగ్గరకు వచ్చాను. తెలిసిందిగా... నువ్వు మంచం పట్టినందువల్ల నీ కొడుకు చదువు ఆగిపోయిందనే దిగులు నీకు అనవసరమని అర్థమైందిగా.

“రాజకీయాల్లో రాకెట్‌లా దూసుకుపోగల ప్రతిభ మనవాడికి ఉంది! మన ఊరుకూ ఎంతో మేలు చేయగలుగుతాడు! ఇక ఎన్నిక అనేది లాంఛన ప్రాయమే అనుకో. నేను పక్కన ఉండి అన్ని విషయాలూ చూసుకుంటాను. సలహాలు ఇస్తూంటాను. సరేనా....?”

మా నాన్న కళ్ళల్లోకి ఓ క్షణం వెలుగు వచ్చింది. ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నట్లుగా శక్తి కూడదీసుకుంటూ నాన్న ముద్ద ముద్ద మాటలతో చెప్పిన మాటల సారాంశం ఏంటంటే... ‘మీ వెనకనే ఉండి వీడు మిమ్మల్ని అనుసరించాలి గానీ, దాటి ముందుకు వెళ్ళాలనే ఆలోచన మంచిది కాదు. నాకూ సమ్మతం కాదు. కానీ మీరు వాడి తెలివితేటల్ని మెచ్చుకున్నందుకు మాత్రం చాలా ఆనందంగా ఉంది!’ అని.

నాన్న వారి చేయి పట్టుకుని అయ్యా... అని ఓ క్షణం ఆగి ‘నరసింహా...’ అంటూ ఆగిపోయాడు.

ఆ తరువాత పిలవలేక ఆయాసంతో మాట ఆపేశాడో లేక తనని ఎప్పుడూ స్నేహితుడిని పిలిచినట్లుగా పిలవమనే ఆయన మాటను ఒకసారైనా మన్నించాలని నాన్న అనుకున్నాడో మాత్రం అర్థం కాలేదు!

ఆయన ఏదో అనబోతోంటే నేనూ నా అభిప్రాయం చెప్పేశాను. నేనెపుడూ మనసులో అనుకునే మాటే అది. వారి అనుచరిడిగా నేను అ, ఆలను సమర్థవంతంగా నేర్చుకోగలిగాను! అది చాలు నాకు అని.

నేను మధ్యలో అడ్డం వెళ్ళి ఆశ్చర్యంగా అడిగాను “అ, ఆ ఏంటండీ?”

“అంటే నా ఉద్దేశ్యం... అనుసరించటం, ఆచరించటం అని! అంతేనమ్మ అంటే వారిని అనుసరించటం, వారి ఆలోచనలని ఆచరించటం అని చెప్పి నా ఉద్దేశ్యం అంటూ ఆగి, ఒక క్షణం మనసు భారమైందేమో మౌనంగా ఉండిపోయి మళ్ళీ కొనసాగించారు.

చదువు మానేయాల్సి వచ్చినందుకు బాధపడాల్సిన అవసరం లేదనీ, ఇంకో రంగంలోనైనా రాణించే అవకాశం ఉంటుందని నాగురించి నాన్నకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో భరోసా కలిగించటానికి అలా చెప్పారో, లేక నిజంగానే అలా జరగటంతో చెప్పారో తెలియదు. నేనూ నాన్నతో ‘ ఒక్కొక్క మెట్టుగా పైకి చేరుకోవటం బావుంటుంది గానీ ఒక్కసారిగా అందలం ఎక్కాలని అనుకోవటం ఎవరికీ మంచిది కాదు! నేనెపుడూ నరసింహంగారికి అనుచరుడిగా పక్కనే ఉంటాను. అదే నాకు నచ్చిన పదవి. వేరేవి నాకవసరం లేదు నాన్నా’ అనగానే నాన్న మొహంలోకి ప్రశాంతత వచ్చింది.

‘ఏదో వాదనలా ఉంది... ఏమిటీ’ అంటూ నాన్నమ్మ, ఆ వెనుకే అమ్మ వచ్చి నాన్న

మంచానికి ఎదురుగా నిలబడ్డారు.

నాన్న మా అందరివైపూ ఒకసారి చూపులు తిప్పారు. ఎదురుగా ఉన్న నాన్నమ్మ, అమ్మ వైపు చూస్తుండిపోయారు.

నాన్న పెదవులపైకి వచ్చిన చిరునవ్వు చెరగనేలేదు..కానీ శ్వాస మాత్రం ఆగిపోయింది!

నాన్న కిరువేపులా నాన్న చేతుల్ని పట్టుకుని ఉన్న నాకూ, నరసింహంగారికి ఏం జరిగిందో అర్థమైపోయింది....!

ఆత్మీయుల మరణం ఎంత బాధాకరంగా ఉంటుందో నాకు మొదటిసారి అర్థమైంది...!

'రాఘవా... ఇలా చేశావేంటీ... నిన్ను సాగనంపటానికే వచ్చినట్లుగా ఇలా...' ఆయన గొంతులో దుఃఖం పెల్లుబికింది.

'చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్న దురదృష్టవంతుడిని. ఇప్పుడు... నా ఆత్మీయ మిత్రుడు ఇంత చిన్న వయసులోనే దూరమవటం ఏమిటీ...!' ఆయన చిన్నపిల్లాడిలా విలవిలాడుతోంటే, నేనే పెద్దరికం తెచ్చుకుని 'ఏది ఎప్పుడు ఎలా జరగాల్సి ఉందో... అలా జరిగిపోతోంటుంది. మీరు సాగనంపటానికే వచ్చినట్లుందని బాధపడటం కంటే... స్నేహితుడి సమక్షంలో నాన్న చాలా సంతృప్తిగా వెళ్లిపోయాడని భావించటమే మనం చేయాల్సిందండీ...' అంటూ అనునయించాల్సి వచ్చింది!

అటువంటి పరిస్థితి చాలా విచిత్రంగా అనిపించింది !